



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించిన స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రి

అంతా హడావుడే!



వైసీపీ ప్రజా ప్రతినిధులు ఎన్నికల చిత్రాలకు తెర తీశారు. స్టేట్ క్యాన్సర్ యూనిట్‌ను తమ ఖాతాలో జమ చేసుకోవాలని షెడ్యూల్ రాకముందే ప్రారంభించారు. ఫర్నిచర్ లేదు.. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన లీనియర్ యాక్సిలలేటర్ వంటి కీలకమైన యంత్రాలు తీసుకు రాలేదు. ఓ వార్డులో ఐదారు మంచాలు వేసి హడావుడిగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేత ఈ నెల 7న ప్రారంభోత్సవం చేయించారు. ఆ వెంటనే తలుపులు వేశారు. గదులు అన్ని కూడా ఖాళీగా ఉన్నాయి. మంత్రి బుగ్గనకే ప్రారంభోత్సవం శిలాఫలకంపై పేరు చూసుకోవడంలో ఉన్న శ్రద్ధ.. యంత్రాలు, ఫర్నీచర్ తెప్పించడంలో లేదా..? అంటూ ప్రధాన ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇదే ఒక్కటే చాలా వరకు అభివృద్ధి పనులు పూర్తికాకుండానే మంత్రి బుగ్గన రిబ్బన్ కటింగ్ చేసుకుంటూ పోతున్నారు. శిలాఫలకంపై తన పేరు ఉంటే చాలు అన్న చందంగా ప్రారంభోత్సవాలు చేస్తున్నారు.

● రిబ్బన్ కటింగ్‌లో మునిగి తేలుతున్న బుగ్గన ● అభివృద్ధి పనులు పూర్తికాకుండానే శిలాఫలకాలు ● యంత్రాలు లేకుండానే క్యాన్సర్ యూనిట్ ప్రారంభం



అసంపూర్తిగా లీనియర్ యాక్సిలలేటర్ విభాగం

కర్నూలు స్టేట్ క్యాన్సర్ యూనిట్ పరిస్థితి ఇది

కర్నూలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా రాయలసీమ ముఖద్వారం కర్నూలుకు స్టేట్ క్యాన్సర్ యూనిట్ మంజూరు చేశారు. ఈ క్యాన్సర్ ఆస్పత్రి కోసం గత టీడీపీ ప్రభుత్వం కర్నూలు సర్వజన వైద్య శాల (కేఎంసీ)లో 9 ఎకరాలు కేటాయించింది. రూ.120 కోట్లు నిధులు కేటాయించగా.. అందులో రూ.35 కోట్లతో జీ+1 తరహాలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ రెండు అంతస్తులు 1.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో లీనియర్ యాక్సిలలేటర్ (రోగి క్యాన్సర్ గుర్తించి రేడియేషన్ ట్రీట్మెంట్ ఇచ్చే కేంద్రం) సెంటర్ ఎల్‌ఏ-1, ఎల్‌ఏ-2 చాంబర్స్, 3 ఆపరేషన్ థియేటర్లు (ఓటీ), ఎమర్జెన్సీ, ఐసీయూ వార్డులు, జనరల్ వార్డులు, సహా వివిధ విభాగాలు 9 బ్లాకుల్లో నిర్మాణానికి 2018లో టెండర్లు పిలవగా.. హైదరాబాదుకు చెందిన సాయి పవర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ టెండరు దక్కించుకుంది. టీడీపీ ప్రభుత్వంలో పనులకు శ్రీకారం చుట్టినా.. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చాక అంతులేని నిర్లక్ష్యం శాపంగా మారింది. ఈ ఐదేళ్లలో కేవలం భవన నిర్మాణాలను అతికష్టంపై పూర్తి చేయగలిగారు.



ఫర్నీచర్ లేకుండా ఖాళీగా ఉన్న వివిధ వార్డులు

● భవనాల నిర్మాణం పూర్తి చేశాం

స్టేట్ క్యాన్సర్ యూనిట్‌ను రూ.35 కోట్లతో చేపట్టాం. వివిధ కారణాల వల్ల జాప్యం జరిగింది. 95 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వారం రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తాం. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన యంత్రాలు హెడ్ ఆఫీస్ కొనుగోలు చేయాల్సి ఉంది.

- శివకుమార్, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ, కర్నూలు

● ఎన్నికల షెడ్యూల్ వస్తుందని..

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి సహా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ నెల 7న స్టేట్ క్యాన్సర్ యూనిట్‌ను ప్రారంభించారు. అదే రోజు నుంచి అధునాతన క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటుకి వస్తాయని రాయలసీమ ప్రజలు ఆశించారు. ఐదారు రోజులు గడిచినా వైద్య సేవలు మొదలు కాలేదు. ఆస్పత్రి వివిధ బ్లాకులు పరిశీలిస్తే.. ఏ ఒక్క బ్లాక్‌లోనూ ఫర్నిచర్ లేదు. ప్రారంభోత్సవం సందర్భంగా ఓ బ్లాకులో ఒక్కటే ఐదారు పాత మంచాలు వేశారు. ఆ గదికి కూడా తాళం వేశారు. క్యాన్సర్ చికిత్సకు అత్యంత కీలకమైన లీనియర్ యాక్సిలలేటర్ యంత్రాలు సహా ఆపరేషన్ థియేటర్ (ఓటీ), ఎమర్జెన్సీ, ఐసీయూ వార్డుల్లో కూడా వైద్య చికిత్స పరికరాలు లేవు. ఎన్నికల కోసం స్టేట్ క్యాన్సర్ యూనిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు హడావుడిగా ప్రారంభోత్సవం చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ వస్తే శిలాఫలకంపై పేరు ఉండదనే రాజకీయ స్వార్థంతోనే ఇలా చేశారన్న విమర్శలు ఉన్నాయి.



క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన(ఫైల్)





అసంపూర్తి నిర్మాణాలు

శ్రీగిరిపై ముగిసిన బ్రహ్మోత్సవాలు

● అశ్వ వాహనంపై విహరించిన ఆది దంపతులు
● చివరి రోజున పుష్పోత్సవం, శయనోత్సవం



స్వామి,అమ్మవార్లకు పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీశైలం, మార్చి 11: శ్రీశైల క్షేత్రంలో ఈ నెల 1న ప్రారంభమైన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పంచాహ్నిక దీక్షతో 11 రోజులు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ వాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు జరిపారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, శంఖు, ఢమరుక నాదాలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, ఉభయదేవాలయాల అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పుష్పోత్సవం:

ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం జరిపారు. కాగడాలు, పసుపు బంతి, పసుపు చేమంతి, తెల్ల చేమంతి, నీలం చేమంతి, నందివర్ధనం, గరుడ వర్ధనం, మందారం, ఎర్ర ఆస్టర్, నీలం ఆస్టర్, మల్లెలు మొదలైన 21 రకాల పుష్పాలను విశేషంగా స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ఏకాంత సేవ చేసి శయనోత్సవం నిర్వహించారు.

● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సోమవారం హరికథ, భక్తి రంజని కార్యక్రమాలను నిర్వహించింది. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారులు అద్భుత ప్రదర్శనతో భక్తులను ఎంతగానో అలరించారు.

మంత్రాలయంలో గురువైభవం

● ప్రారంభమైన రాఘవేంద్రస్వామి ఉత్సవాలు ● ప్రముఖులకు అవార్డులు అందజేసిన పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 11: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జ్యోతిప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. మొదటి రోజే వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఉత్సవాలకు తరలివచ్చారు. ఉదయం నుంచి రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. మూలరాములకు బంగారు నాణెలతో అభిషేకంచేసి హారతులు ఇచ్చారు. యోగీంద్ర కళా మండపంలో రాఘవేంద్ర స్వామి విగ్రహనికి జ్యోతి ప్రజ్వలనచేసి ఉత్సవాలకు నాంది పలికారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులకు పాదపూజ చేసి చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఊరేగించారు. పీఠాధిపతి మహ మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సోమవారం రాత్రి హుబ్లీకి చెందిన భావదీప శిక్షణ సమితి బృందం నిర్వహించిన హరహర మహాదేవ నృత్య ప్రదర్శన, బెంగుళూరుకు చెందిన విధూషి గీతచే నిర్వహించిన ఓకల్ సంగీతం భక్తులను ఆకట్టుకుంది.



జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి

● ప్రముఖులకు అవార్డుల ప్రదానం :

గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో రాయచూరు జిల్లా ఎస్పీ నిఖిల్, బెంగుళూరు కర్ణాటక సంస్కృత యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ధరణప్పకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు గురువైభవోత్సవ- 2024 అవార్డులను ప్రదానం చేశారు. ప్రశంసాపత్రం, నగదు, వెండిగిన్నె, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి భక్తుల ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, వాదిరాజాచార్, ఈఈ సురేష్ కోణాపూర్, ఏఈ బద్రినాథ్, అనంతపురాణిక్, రవికులకర్ణి, విజయేంద్రాచార్ పాల్గొన్నారు.



నృత్య కళాకారులతో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

జగన్ ఇక ఇంటికే...

● వైసీపీ పాలనలో హత్యలు, డ్రామాలు, మాఫియాలే
● బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్ ధ్వజం



కర్నూలు(అర్బన్), మార్చి 11: మేదరమెట్ల సిద్ధం సభను చూస్తుంటే జగన్ ఇక ఇంటికేనని స్పష్టమవుతోందని అన్నారు. టీడీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్ గౌడ్‌లు సోమవారం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మాట్లాడారు. జగన రెడ్డి పాలనలో కోడి కత్తి డ్రామాలు, బాబాయి హత్య, అసాంఘిక కార్యకలాపాలు, మైనింగ్, లిక్కర్ మాఫియాలు తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. మేదరమెట్ల సిద్ధం సభలో మాట్లాడిన తీరును జగన్ వెన్నులో వణుకు పుట్టిందని అర్థమవుతోందని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి గురించి ఏ గ్రామానికి వెళ్లినా కనిపిస్తుందని అన్నారు. జగన్‌రెడ్డి మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు అధికారమిచ్చారని, నిరంకుశ, అప్రజాస్వామిక పాలనను చూసి చరమగీతం పాడాలని ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమని హెచ్చరించారు. వేలాది రూపాయలు ఇచ్చి మందు, బిర్యాణి సరఫరా చేసి జనాన్ని సిద్ధం సభకు తరలించారని ఆరోపించారు. సకల శాఖ అనుచరుడు సజ్జల పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

వడదెబ్బ నుంచి కాపాడుకోండి

డీఎంహెచ్‌వో రామగిడ్డయ్య



కర్నూలు(హాస్పిటల్), మార్చి 11: వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు డీఎంహెచ్‌వో బి.రామగిడ్డయ్య అన్నారు. వడదెబ్బ లక్షణాలు, నివారణ జాగ్రత్తలపై సోమవారం ఆయన మాట్లాడారు. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పెరుగుతుండటంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపరీతమైన ఎండ తాకిడికి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, అలా జరిగితే వెంటనే పీహెచ్‌సీ వైద్యున్ని సంప్రదించాలని అన్నారు. వడదెబ్బ తగిలిన వారికి తలనొప్పి, తల తిరగడం, నీరసం, జ్వరం, నాలుక ఎండిపోవడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. రోజుకు కనీసం ఐదు లీటర్ల నీరు తాగాలని, కొబ్బరి నీరు, మజ్జిగ, పండ్ల రసాలు, ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని సూచించారు. నలుపు రంగు కాకుండా లేత రంగుల కాటన్ దుస్తులు వాడాలని, ఇంట్లో కిటికలకు తలబట్ట కట్టడం వల్ల చల్లని గాలి వస్తుందన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి మార్చి గాలి తగిలేటట్లు చేయాలని, ఓఆర్ఎస్, ద్రావణం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన మజ్జిగ తాపాలని సూచించారు.

పవిత్ర మాసం రంజాన్

- నేటి నుంచి కఠోర ఉపవాస దీక్షలు
- నెలవంక దర్శనంతో సిద్ధమైన ముస్లింలు
- ముస్తాబైన మసీదులు



ఇస్లాంలో నాలుగో మూలస్తంభం ఉపవాసం. ముస్లిం సమాజం త్రికరణ శుద్ధితో ఆచరించే ఆరాధన వ్రతం ఉపవాసం. ఎదుటివారి ఆకలి విలువను గుర్తించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఉపవాసాన్ని అరబ్బీ భాషలో 'సౌమ్'గాను, ఉర్దూలో 'రోజా'గా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం తొమ్మిదో నెల అయిన రంజాన్‌లో ఈ ఆరాధన వ్రతాన్ని పాటిస్తారు. ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో సౌమ్(రోజా) అంటే ఆగి ఉండటం. అంటే సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ తినడానికి.. తాగడానికి.. మనో వాంఛలకు దూరంగా ఉండమని అర్థం. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం సోమవారం నెలవంక దర్శనంతో మంగళవారం నుంచి ప్రారంభం కానుంది.

కర్నూలు (కల్చరల్), మార్చి 11: ఇస్లామిక్ క్యాలెండర్‌లో వచ్చే రంజాన్ మాసానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ మాసంలో ముస్లింలు ఆధ్యాత్మిక భావనలతో, ధార్మిక చింతనలతో గడుపుతారు. మానవుడు సామాజికంగా ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో రంజాన్ మాసం బోధిస్తుంది. రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ముస్లింలు నిత్యం నమాజులతో, ఖురాన్ గ్రంథం పఠనంతో, పద్నాలుగు గంటల పాటు ఉపవాసం పాటిస్తూ ఉంటారు. అంతేకాదు, ప్రతి వ్యక్తి తాను సంపాదించిన దానిలో కొంత భాగం పేదలకు ఖర్చుచేయాలని కూడా ఈ మాసం ఉద్బోధిస్తుంది. అందుకే ప్రతి ముస్లిం రంజాన్ మాసం ఆరంభం కోసం నెలవంకవైపు ఆశగా చూస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో రంజాన్ సందడి గత రెండు రోజుల ముందే కానవచ్చింది. రోజా దీక్షలు పాటించే వారికి సాయంత్రం దీక్షల ముగింపు ఉపాహారంగా నిలిచే హలీమ్ కేంద్రాలు, పండ్లు, ఫలాహార కేంద్రాలు వివిధ ప్రాంతాల్లో వెలిశాయి. రంజాన్ మాసంలో ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ ముస్లింలు ఎలాంటి ఆహారం కనీసం నీళ్లు కూడా తాగకుండా కఠోర దీక్ష పాటిస్తారు. ఇందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. రోజా, నమాజ్, జికర్, దువాలతో గడపనున్నారు. సెహరీ, ఇఫ్తార్ విందులతో సందడి చేయనున్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మసీదులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యికి పైగా మసీదులు ఉండగా, ఒక్క కర్నూలు నగరంలో 200 వరకు మసీదులు ఉన్నాయి. రంజాన్ సందర్భంగా వివిధ మసీదులను ప్రత్యేక నమాజులకు సిద్ధం చేశారు. నిత్యం ఐదు పూటలా నమాజులతోపాటూ ప్రత్యేక ఈద్ నమాజ్‌లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఆయా మసీదుల కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

● రోజా నియమాలు...ప్రాముఖ్యం

ఇస్లాం సౌధానికి ఉండే మూల స్తంభాల్లో రంజాన్ ఉపవాస వ్రతాలు ఒకటి. ఉపవాసం పాటిస్తున్నప్పుడు వాటి బాహ్య నియమాలతోపాటు, అంతర్ నియమాలు కూడా తప్పకుండా పాటించాలి. అబద్ధాలు చెప్పడం, చాడీలు చెప్పడం, దూషించడం, పరోక్షంగా నిందించడం, దురుసుగా మాట్లాడటం, అశ్లీల మాటలు పలుకడం, పోట్లాటకు దిగడం వంటి వాటికి దూరంగా ఉండాలి. ఈ భావనలు జీవితాంతం అనుసరించాలి. ప్రతిరోజూ ఐదు పూటల నమాజ్‌తో అదనంగా రాత్రి ఇషా నమాజ్ ఆ తర్వాత 20 రకాల తరావీహ్ నమాజులు ఆచరించాలి.

● 'దివ్య ఖురాన్' అవతరించిన నెల

ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించి, సదా ఆచరించే దివ్యఖురాన్ రంజాన్ నెలలోనే అవతరించింది. ఇతర ప్రవక్తలపై ఫర్మానులు సైతం ఇదే నెలలో అవతరించాయి. అందుకే ఈ నెలకు అంతటి ప్రాధాన్యం. ఈ సమయంలో సైతాను బంధీ అవుతాడని, నరకద్వారాలు మూతపడి, స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయన్నది ముస్లింల ప్రగాఢ విశ్వాసం. రోజా ఆచరించే 30 రోజుల్లో మొదటి పది రోజులను ముస్లింలు కారుణ్య దినాలుగా నమ్ముతారు. 10 నుంచి 20 రోజులు క్షమాపణ రోజులు, 20 నుంచి 30వ రోజువరకు నరకాగ్ని నుంచి విముక్తి దినాలుగా ముస్లింలు విశ్వసిస్తారు. రోజా పాటించడంలో కొందరికి మినహాయింపు ఉంటుంది. చిన్నపిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వయో వృద్ధులు, మతిస్థిమితం లేనివారు, అశుద్ధావస్థలో ఉన్న మహిళలకు ఉపవాసం నుంచి మినహాయింపు ఉంటుంది.



నంద్యాల జిల్లా చాగలమర్రిలో ముస్తాబైన 500 ఏళ్ల చరిత్రగల అరబ్ మసీదు

టీచర్ సస్పెన్షన్‌పై విచారణ

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం కోయిలకుంట్ల మండలం రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచరుగా పని చేస్తున్న కె.సతీష్ కుమార్ సస్పెన్షన్‌పై విచారణ జరిగింది. ఏపీ లైబ్రరీ డైరెక్టర్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ఈ విచారణ నిర్వహించారు. ఈ విచారణకు పూర్వపు ఆర్జేడీ వెంకట క్రిష్టారెడ్డి, రిటైర్డు డీఈవో రంగారెడ్డి, నంద్యాల ఉప విద్యాశాఖ అధికారి బేగ్, ఎంఈవోలు బ్రహ్మం, శ్రీనివాసులతో పాటు కె.సతీష్ కుమార్ విచారణకు హాజరయ్యారు. విచారణలో బీటీఎఫ్ నాయకులు జగదీష్, వెంకటస్వామి, శంకర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జడ్పీ స్టాండింగ్ సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 11: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశభవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11 నుండి 12 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12 గంటల నుండి ఒంటి గంట వరకు 5వ స్థాయి సంఘం, మధ్యాహ్నం ఒంటి గంట నుండి 2 గంటల వరకు 4వస్థాయి సంఘం, 2:30 గంటల నుండి 3:30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, 3:30 గంటల నుండి 4:30 గంటల వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షకు 665 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సోమవారం జరిగిన పరీక్షకు 665 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో ఎస్వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 19,145 మంది ఉన్నారు. ఇందులో 18,480 మంది పరీక్షకు హాజరు కాగా, 665 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్‌పాషా, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి.

రాక్షస పాలనను అంతమొందించాలి

● టీడీపీ శ్రేణులకు గౌరు చరిత పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న గౌరు చరిత

పాణ్యం, మార్చి 11: జగన్ రాక్షస పాలనను అంతమొందించడమే ధ్యేయంగా పనిచేయాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పాణ్యం టీడీపీ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరు చరిత, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీని ఓడించి రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని వదిలించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఇందుకోసం మండలంలోని ప్రతిగ్రామంలో శంఖారావం పేరుతో టీడీపీ చేపట్టబోయే అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. జగన్ పాలనలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌పై బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. బీసీల ఆదరణ పథకాన్ని మరింత ముందుకు నడిపిస్తామన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పట్టాల పంపిణీతో పేదలను మోసం చేస్తున్నాడన్నారు. కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లెలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గౌరు చరిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరామిరెడ్డి, రామ్మోహన్ నాయుడు, భాస్కరరెడ్డి, రంగరమేష్, నారాయణమ్మ, రమణమూర్తి, జనసేన నాయకులు జగదీశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన




మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 11: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల నిర్వహణ అంశాలపై మీడియా ప్రతినిధులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ జి.సృజన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధానాలు, నియమాలపై రిటర్నింగ్ అధికారులతో పాటు పొలిటికల్ పార్టీలు, మీడియా ప్రతినిధులకు స్పష్టత ఉండాలన్న ఉద్దేశంతో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తేదీ, ఎన్నికల నోటిఫికేషన్ తేదీ వేర్వేరుగా ఉంటుందన్నారు. నోటిఫికేషన్ తేదీ నుంచి నామినేషన్లు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ తేదీన ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్‌ను పబ్లిష్ చేయడం జరుగుతుందని, ఆ వెంటనే నామినేషన్లు వేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఓటర్లను మతపరంగా కానీ, కులాల పరంగా, ఓట్లు అడిగినా ఇతర అభ్యర్థుల ప్రచారానికి భంగం కలిగించిన ఎంసీసీ నియమాల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. వాహనాలను తనిఖీ సమయంలో ఏ వాహనంలోనైనా రూ.50వేలకు మించి డబ్బులు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి మీడియా నోడల్ అధికారి వెంకటలక్ష్మమ్మ, జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రాఘవేంద్ర స్వామి

403వ పట్టాభిషేక మహోత్సవం

మంత్రాలయం, మార్చి 11: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభోత్సావాల్లో ప్రాముఖ్యమైన రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషకం మంగళవారం వైభవంగా జరగనుంది. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేతుల మీదుగా బంగారు సింహాసనంపై రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలను అధిష్టించి, బంగారు, వెండి, ముత్యాలు, నాణ్యాలు, వివిధ రకాల పుష్పాలతో అభిషేకించి బంగారు రథంపై ఊరేగించనున్నారు. ఈ విశిష్టమైన రోజును పురస్కరించుకుని దేశ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.



బంగారు పాదుకలకు తలపై పెట్టుకున్న పీఠాధిపతి

కూలీలపై దూసుకెళ్లిన రైలు

● ఇద్దరి మృతి ● ఒకరికి తీవ్ర గాయాలు



ఓబులేసు (ఫైల్)



బోయ కిష్టన్న (ఫైల్)



ప్రమాదంపై విచారణ చేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మద్దికెర/తుగ్గలి, మార్చి 11: రైల్వే కూలీలపై రైలు దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన బోయ కిష్టన్న (64), ఓబులేసు (42) కొప్పుల కాశీతో పాటు మరి కొంత మంది కూలీలు మద్దికెర, తుగ్గలి మార్గమధ్యలో రైల్వేట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్నారు. మొదటి లైనులో గూడ్స్ రాగా కూలీలు రెండో ట్రాక్‌పైకి వెళ్లారు. అయితే అదే సమయంలో రెండో లైనులో గుంతకల్లు నుంచి డోన్‌కు వెళ్తున్న రైలు (07288) వచ్చింది. గూడ్స్ శబ్దం కారణంగా రైలును కూలీలు గమనించలేకపోయారు. దీంతో కిష్టన్న, ఓబులేసులపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో కూలీ కాశీకి కాలు విరిగిపోవడంతో కర్నూలుకు తరలించారు. రైల్వే ట్రాక్‌పై మరమ్మతులు చేస్తున్న సమయంలో అక్కడ రైల్వే ఉద్యోగులు ఎవరూ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుల బంధువులు, ఆరోపిస్తున్నారు. కిష్టన్నకు కుమారుడు ఓబులేసు, కుమార్తె సువర్ణలు ఉన్నారు. కిష్టన్న భార్య శివమ్మ ఇటీవలే మృతి చెందింది. ఓబులేసుకు భార్య లక్ష్మీదేవితోపాటు కూతుర్లు శేకమ్మ, రాణెమ్మ, కుమారులు నరసింహులు ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ, వైసీపీ నాయకులు తిరుపాల్‌నాయుడు నాగభూషణంరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఒక్కో కుటుంబానికి రూ.30 లక్షల పరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ మురళీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. విచారణ చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లుకు తరలించారు. బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

మంత్రి బుగ్గన అవినీతి చిట్టా విప్పుతా

● కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
● వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 11: ఐదేళ్ల కాలంలో మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని బుగ్గన చేసిన అవినీతి చిట్టాను త్వరలో ప్రజల ముందు ఉంచుతామని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి సమక్షంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి పెద్దఎత్తున చేరారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి బుగ్గన డబ్బు అహంకారంతో మాట్లాడుతుండటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కోట్ల కుటుంబానికి డబ్బులు లేకపోవచ్చు గానీ.. ప్రజలే తమకు బలం అన్నారు. మంత్రి అభివృద్ధి అంతా కాంట్రాక్టర్ల కోసమే జరిగిందని, ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అధికారం అడ్డం పెట్టుకుని రూ.వేల కోట్లు సంపాదించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దమ్ము ధైర్యం ఉంటే... తనను రాజకీయంగా ఎదుర్కోవాలని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఖబడ్దార్ అని కోట్ల హెచ్చరించారు. డోన్ నియోజకవర్గంలో ఇంత మంది కడుపు కొట్టి మైనింగ్ వ్యాపారాలు లాక్కోవడం వాస్తవం కాదాని నిలదీశారు. డోన్ నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరడం ఆరంభం మాత్రమేనని, మున్ముందు వైసీపీ జెండా పీకేయడం ఖాయమన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటంతో వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని అన్నారు. అందరం కష్టపడి పని చేసి డోన్ నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి చంద్రబాబు శపథాన్ని నెరవేరుద్దామని కోట్ల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, రంజిత్ కిరణ్, మర్రి మణి, ఈశ్వరయ్య, జయరాముడు, ఎల్ల గౌడు, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

● టీడీపీలోకి భారీగా చేరికలు: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. వైసీపీ నాయకుడు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రగుంట్లపల్లి, కలచట్ల గ్రామాల నుంచి వంద కుటుంబాలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో వైసీపీకి ఆ గ్రామాల్లో కోలుకోలేని దెబ్బ తగిలింది. అదేవిధంగా డోన్ మండలంలోని డి.రామదుర్గం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సాంబశివుడు, లక్ష్మీనారాయణ, లక్ష్మన్న, రామలింగడు, లింగన్న, నాగేశ్వర, కోటి లింగడు, సుంకన్న, రామాంజనేయులు, ధనుంజయతోపాటు మరో 40 మంది కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

జిల్లా జైలు తనిఖీ



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్), మార్చి 11: పంచలింగాలలోని జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. ఖైదీల గదులు, జైలు రికార్డులు, ఖైదీలకు అందిస్తున్న మెనూను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఖైదీల మిలాఖత్‌ల కోసం వచ్చే సందర్శకుల అవసరార్థం తాగు నీటి చలివేంద్రాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. ఖైదీలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఖైదీలు నేర ప్రవృత్తిని వీడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని, ఖైదీలకు అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని తాము అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ ఎం.వెంకటహరినాథ్, చీఫ్ డిఫెన్స్ లీగల్ ఎయిర్ కౌన్సిల్ ఎస్.మనోహర్, ప్రొబెషన్ ఆఫీసర్ దివాకర్, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఘనే నాయక్, మెడికల్ ఆఫీసర్ ఆర్.జగదీష్, జైలర్ జి.ఎరికినాయుడు, డిప్యూటీ జైలర్ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వామ్మో వాము

● భారీగా పెరిగిన ధర
● క్వింటా గరిష్ఠ ధర రూ.32,011



యార్డుకు రైతులు విక్రయానికి తెచ్చిన వాము

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 11: కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున రైతులు వామును విక్రయానికి తీసుకొస్తున్నారు. సోమవారం 658 క్వింటాళ్ల వాము కర్నూలు యార్డుకు విక్రయానికి వచ్చింది. గరిష్ఠ ధర క్వింటాకు రూ.32,011 పలకగా, మధ్యస్థ ధర రూ.18,060, కనిష్ఠ ధర రూ.10,111కు అమ్ముడుపోయింది. వేరుశనగ కాయలకు ధర నేల చూపే చూస్తుంది. గరిష్ఠ ధర రూ.7,029, మధ్యస్థ ధర రూ.6,069లు, కనిష్ఠ ధర రూ.3,519లకు అమ్ముడుపోయింది. ఆముదాలకు లభిస్తున్న ధరతో రైతులు కొంత ఊరట చెందుతున్నారు. గరిష్ఠ ధర రూ.5,445లు, మధ్యస్థ ధర రూ.5,379లు, కనిష్ఠ ధర రూ.5,089లకు అమ్ముడుపోయినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. కందులకు గరిష్ఠ ధర రూ.9,739లు, మధ్యస్థ ధర రూ.7,879లు, కనిష్ఠ ధర రూ.2,702లకు అమ్ముడుపోయింది. శనగలకు గరిష్ఠ ధర రూ.6,359లు, మధ్యస్థ ధర రూ.5,889లు, కనిష్ఠ ధర రూ.2,100లకు చేరింది. ఉల్లిగడ్డలకు క్వింటాకు రూ.1,669లు, మధ్యస్థ ధర రూ.1,559లు, కనిష్ఠ ధర రూ.306లకు అమ్ముడుపోయింది. ఎండుమిరపకు గరిష్ఠంగా రూ.17,011లు, మధ్యస్థ ధర రూ.13,199లు, కనిష్ఠం రూ.999లకు పలికింది.

ఐఐఐటీడీఎంలో రోబోల వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పూణే డీఆర్‌డీవో శాస్త్రవేత్త కిరణ్ ఆఖెల

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: స్థానిక ఐఐఐటీడీఎంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో రోబోల ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీపై వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపు 17వ తేదీ వరకు కొనసాగుతుంది. పూణె డీఆర్‌డీవో కిరణ్ ఆఖేల్లాలు, డైరెక్టర్ సోమయాజులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంస్థకు యాక్సిలరేట్ విజ్ఞాన్ కార్యశాల పథకం కింద భారత ప్రభుత్వం సైన్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు ఆర్థిక సహకారంతో కొనసాగుతున్నారు. ఇందులో 25 మందికి రూ.5 లక్షల రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్సీ రంగాలలో పరిశోధన చేస్తున్న విద్యార్థులకు వర్క్‌షాపు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్త డా.రవికుమార్, దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల నుంచి ప్రముఖులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: జిల్లాలోని 26 కేజీబీవీలలో 6వ తరగతిలో చేరేందుకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్ఎస్‌ఏ ఏపీసీ విజయ జ్యోతి కుమారి సోమవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడిబయట చిన్నారులు, డ్రాపవుట్లు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో పారదర్శక పరిశీలన అనంతరం ఎంపికైన వారి ఫోన్ నెంబర్లకు మెసేజీ రూపంలో సమాచారం అందుతుందని తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి గానూ ప్రతి కేజీబీవీలో 40 సీట్లు కేటాయించామని చెప్పారు. జిల్లాలో మొత్తం 26 కేజీబీవీలలో 1,040 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో జిల్లాలోని 11 కేజీబీవీలు ఆదోని జనరల్, చిప్పగిరి, దేవనకొండ, గోనెగండ్ల, గూడూరు, హాలహర్వి, కౌతాళం, మద్దికెర, నందవరం, వెల్దుర్తి, పెద్దకడుబూరులలో ఎంపీసీ గ్రూపులు నిర్వహిస్తున్నామని, వీటిలో ప్రతి కేజీబీవీకి 40 చొప్పున మొత్తం 440 సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. జిల్లాలోని ఆలూరు, ఆస్పరి, బెళగల్, హొళగుంద, కోడుమూరు, క్రిష్ణగిరి, తుగ్గలి కేజీబీవీలలో బైపీసీ గ్రూపులు ఉన్నాయని తెలిపారు. ఒక్కొక్క కేజీబీవీలో 40 సీట్ల చొప్పున మొత్తం 360 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎమ్మిగనూరు, ఓర్వకల్లు కేజీబీవీలో ఎంఈసీ గ్రూపు, ఆదోని (మైనార్టీ) రిటైల్ మేనేజ్మెంటు గ్రూపులో 40 సీట్లు, కల్లూరు మైనార్టీలో సీఎస్‌సీ గ్రూపులో 40 సీట్లు, కోసిగిలో పీఎస్‌టీటీ గ్రూపులో 40 సీట్లు, కర్నూలు కేజీబీవీలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపులో 40 సీట్లు, మంత్రాలయం కేజీబీవీ ఎంఎల్‌టీ గ్రూపులో 40 సీట్లు కేటాయించామన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు పతక సంచాలకులు విజయజ్యోతి కుమారి తెలిపారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



కాల్వబుగ్గలో స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఓర్వకల్లు, మార్చి 11: కాల్వబుగ్గ రామేశ్వరస్వామి క్షేత్రంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. సోమవారం ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు జంధ్యాల ప్రసాద్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, లక్ష్మీనరసింహ శర్మ లు స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. హోమంలో చాముండేశ్వరి పూజ, జపాలు, నిత్య హోమం, ఫలిహరణ, రుద్రహోమం నిర్వహించారు. ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పారువేట కార్యక్రమాలు జరిపారు. పూర్ణాహుతి, సుగంధ ద్రవ్యాలు, ధాన్యం, పూజా సామగ్రిని హోమగుండానికి సమర్పించారు. కార్యక్రమంలో తాత్కాలిక కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు చారిత్రక అవసరం

కర్నూలు(రూరల్), మార్చి 11: ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ గెలుపు చారిత్రక అవసరమని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం శివరాంపురం గ్రామంలో సోమవారం బొగ్గుల దస్తగిరి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న అరాచకాలపై ప్రజలు విసుగుచెందారన్నారు. గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలను గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, శివకుమార్, రాజశేఖర్, కృష్ణ, మాజీ సర్పంచు మహేష్, భాస్కర్, పామయ్య, శ్రీకాంత్, ఎల్లప్ప, రామకృష్ణ, దస్తగిరి, నరసింహ, వెంకటేష్, కాశోజీరావు, కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయండి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 11: రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధికారులు, పాలక మండలి సభ్యులకు సూచించారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో నిర్మించిన జంబో ప్లాట్‌ఫారాన్ని ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్, కేడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ భీమిరెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అదనపు సెక్రటరీలు వెంకటేశ్వర్లు, రెహిమాన్‌ఖాన్, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివ న్న, నాగేష్ పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 11: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నంద్యాల పార్లమెంటు, కర్నూలు పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులను జాతీయ కార్యదర్శి సత్తార్ సాహెబ్ ఖరారు చేశారు. సోమవారం ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో అత్తావుల్లా ఖాన్ మాట్లాడుతూ కర్నూలు పార్ల మెంటు అభ్యర్థిగా జహంగీర్‌ను, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థిగా షేక్ ఖలీల్ అహ్మద్‌ను అధిష్ఠానం ఆదేశాల మేరకు ఖరారు చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా, వకీల్ అహ్మద్, నగర అధ్యక్షుడు షేక్ అశ్వాక్, ప్రధాన కార్యదర్శి జలీల్ అహ్మద్, అబ్దుల్లా పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 11: విజయవాడ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో మంత్రాలయానికి చెందిన అర్చకులు రాఘవేంద్ర, కులకర్ణి బీజేపీలో చేరినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ తెలిపారు. కులకర్ణి మాట్లాడుతూ దేశ అభివృద్ధి బీజేపీతో సాధ్యమని భావించి పార్టీలో చేరాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ జోన్ ఇన్‌చార్జి బిట్రా శివనారాయణ పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోవడం లేదు

సి.బెళగల్, మార్చి 11: మండలంలోని గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించాలని మండల రెవెన్యూ అధికారులకు స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పోలకల్లు గ్రామానికి చెందిన రైతులు సోమన్న, రాముడు, వెంకటేశ్వర్లు, రామిరెడి వాపోయారు. మండలంలో రైతుల భూసమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినా కూడా మండల రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు చెబుతున్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

సి.బెళగల్, మార్చి 11: ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలని సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. మండలంలోని గామాల్లో ఉపాధి కూలీలు పనులు చేసే సమయంలో తాగునీరు, మెడికల్ కిట్టు, టెంట్లు ఇవ్వాలని కోరారు. అలాగే రైతులకు అనుకూలమైన చోట పనులు కల్పించాలని జిల్లా అధికారుల తెలిపినా పట్టించుకోవడం లేదని కూలీలు వాపోయారు.

గర్భిణులకు అయోడిన్ అవసరం



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు(హస్పిటల్), మార్చి 11: గర్భిణులకు అయోడిన్ ఎంతో అవసరమని డిస్ట్రిక్ ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డా.సుధాకర్ అన్నారు. జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గార్గేయపురం ప్రాథమిక పాఠశాలలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల్లో అయోడిన్ లోపిస్తే గర్భస్రావం, తక్కువ బరువున్న పిల్లలు పుడుతారని అన్నారు. ముల్లంగి, క్యాబేజీ, కాలిఫ్లవర్, బిలగడ దుంపల్లో గాయట్రోజన్స్ అను రసయానాలు ఉంటాయనీ ఇవి థైరాయిడ్ గ్రంథి అయోడిన్‌ను గ్రహించకుండా అటక పరుస్తాయన్నారు. అనంతరం వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గార్గేయపురం పీహెచ్‌సీ వైద్యాధికారి జయలక్ష్మి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెచ్ఎం భారతమ్మ, డిస్టిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ రాధమ్మ, ఏఎన్ఎం లత, ఆశాలు, పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my client M/s.Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My clients intends to grant loan to **Sri. Thuguntla Lakshmi Narasaiah, S/o. Sri.T.Narasimhulu, Shanthi Nagaram Village, Khaji Peta Mdl, Kadapa Dist.** by keeping the below mentioned of property of him as security by way of Registered martgage. as such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The property is residential house plot bearing No.**25** (Western half), In Sy.No.**235** of Kallur Village, in a colony called as **'Lakshmipriya Nagar'**, which is approved vide L.P.No.**48/71**, with in Sub Registration office of Kallur and Dist. Registration office of Kurnool and bounded as follows. **Boundaries: East :** Remaining half in the same plot, **West :** Plot No.24, **North :** 30'feet road, **South :** Plot No.31, **Extent : 122.22** Sq.Yards

BYREDDY VENKATA RAMANA REDDY
ADVOCATE, KURNOOL, CELL:94400 79646

ముస్లింలకు అండగా ఉంటా: టీజీ భరత్



భరోసా యాత్రలో పాల్గొన్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 11: ముస్లింలకు అండగా ఉంటామని కర్నూలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 50 వార్డులోని కొత్తపేటలో టీజీ భరత్ భరోసా యాత్ర కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఆయన స్వయంగా రూపొందించిన ఆరు గ్యారంటీల కరప్రతాలను ప్రజలకు అందించారు. కులం, మతం చూడకుండా పార్టీకి ఎలాంటి వారో కావాలో చూసి ఓటు వేయాలన్నారు. కులం పేరుతో చేసే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్కీటూ గోపి, బి.వెంకటేశ్వర్లు, దశరథరామానాయుడు, మద్దిలేటి, రుద్రప్ప, మధుసూదన్ గుప్తా, వెంకటేశ్వర్లు, ఇమ్రాన్, రఫీ, రజాన్, నవీన్, శంకర్, భరత్, మునాఫ్, విక్రమ్ సింగ్, ప్రకాష్ బూత్ ఇన్‌చార్జిలు పాలొన్నారు.

టీడీపీలో చేరిక : నగరంలోని 3వ వార్డులో బండిమెట్టలో వైసీపీకి చెందిన ఇర్ఫాన్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు టీడీపీలో చేరారు. కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ శాలువ కప్పి వారిని ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రజలకు ఏమి చేశారని వైసీపీకి ఓటు వేయాలని అన్నారు. టీడీపీలోనే మంచి భవిష్యత్తు ఉంటుందని యువత టీడీపీలో చేరుతున్నారన్నారు. టీడీపీ, బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో ముస్లింకు అన్యాయం జరుగుతుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో ఈదాస్, షాబీర్, నాసిర్, సాధిత్, నవాజ్, టీడీపీ నాయకులు నాగ వీరాంజనేయులు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులు ఉన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి: గౌరు చరిత



టీడీపీలో చేరిన వారితో గౌరు దంపతులు

కల్లూరు, మార్చి 11: రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న వైసీపీకి రోజుల దగ్గరపడ్డాయని పాణ్యం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 21వ వార్డు ఎఫ్‌సీఐ కాలనీ, 32వ వార్డు ముజఫర్ నగర్‌లో ఆమె శంఖారావం, బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రసల సమస్యలు తెలుసుకుని ఎన్నికల మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ప్రజా ప్రస్థానంలో ప్రజలకు ఇచ్చిన హమీలను అధికారంలోకి వచ్చాక జగన్ విస్మరించారని అన్నారు. ప్రజా వేదిక కూల్చి వేతతో ప్రారంభమైన జగన్‌రెడ్డి పాలన 58 నెలలుగా ప్రజలను, ప్రతిపక్ష పార్టీల నాయకులను క్షోభకు గురిచేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తున్న జగన్ పార్టీని రానున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, 21వ వార్డు ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ న్యాయవాది నాగమణి, బాబురాజు, 32వ వార్డు ఇన్‌చార్జి టైలర్ నాగరాజు, బందెనవాజ్, పెద్దబీచుపల్లి, ఎన్‌వీ రామకృష్ణ, కాసాని మహేష్‌గౌడ్, జే గంగాధర్‌గౌడ్, పియూ. మాదన్న, ధంజయ, శేఖర్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన యువకులు: పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. సోమవారం మాధవీ నగర్‌లోని గౌరు నివాసంలో కల్లూరు అర్బన్ 35వ వార్డు శివప్పనగర్‌కు చెందిన బుల్లెట్ సుంకన్నతో పాటు పలువురు గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరగా కండువాలు కప్పివారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆదోని ఎల్లప్ప, గానుగ సుంకన్న, తరుణ్, మారెప్ప, కడమంచి హంపి, భద్ర, చిన్నజమ్మన్న, శివ, యువరాజు, డొక్కాఆది, కొండ్రమల్లేష్, మచ్చొడు పాల్గొన్నారు.

టీజీ గౌరమ్మకు ఘన నివాళి



టీజీ గౌరమ్మకు నివాళి అర్పిస్తున్న టీజీ వెంకటేశ్ దంపతులు

కర్నూలు(కల్చరల్), మార్చి 11: రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాతృమూర్తి దివంగత టీజీ గౌరమ్మ వైకుంఠ సమారాధన కార్యక్రమం సోమవారం సంకల్‌బాగ్‌లోని టీజీ వెంకటేశ్ స్వగృహంలో నిర్వహించారు. టీజీ గౌరమ్మకు టీజీ వెంకటేశ్ కుటుంబ సభ్యులు ఘనంగా నివాళి అర్పించారు. టీజీ గౌరమ్మ అడుగుజాడల్లో టీజీ వెంకటేశ్ సేవా దృక్పథం అలవర్చుకొని, గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని పలువురు ప్రముఖులు, ప్రజలు హాజరయ్యారు.


ఆహ్లాద షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న కేఎన్‌వీ రాజశేఖర్, కేజే రెడ్డి

కర్నూలు(కల్చరల్), మార్చి 11: నగరంలో నంద్యాల రోడ్డులోని మారుతి మెగా సిటీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆహ్లాద (ఎస్‌డీఎస్‌సీ) షోరూంను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా రాగమయూరి బిల్డర్స్ ఛైర్మన్ కేజే రెడ్డి, మాంటిస్సోరి విద్యాసంస్థల ఎండీ కేఎన్‌వీ రాజశేఖర్, ఆహ్లాద ఇంజనీర్స్ లిమిటెడ్ సంస్థ ఎండీ సురేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేజే రెడ్డి మాట్లాడుతూ హైదరాబాదు, విజయవాడ వంటి నగరాలతో పోటీ పడుతూ కర్నూలులోనూ ఆధునిక ఉత్పత్తులైన స్టీల్ తలుపులు, కిటికీలు, వివిధ రకాల ఫర్నీచర్స్‌తోపాటు గృహావసరాలకు అనుగుణంగా మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.

రేపటి నుంచి ఓర్వకల్లులో ఉరుసు



ముస్తాబైన దర్గా

ఓర్వకల్లు, మార్చి 11: ఓర్వకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్ షాఖాద్రి స్వామివారి ఉరుసు ఉత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి 15 వరకు నిర్వహిస్తున్నట్లు గురువులు ఎస్ఎండీ నజురుల్లా షాఖాద్రి, ఎస్ఎండీ షఫీ, అల్లాషా ఖాద్రి సోమవారం తెలిపారు. ఈనెల 13న గంధం, 14న ఉరుసు, అన్నదానం, 15న కిస్తీలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 14న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే టీమ్ లకు వరుసగా నాలుగు బహుమతులు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5 వేలు, రూ.3వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8790708393 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే ఈనెల 15న వాలీబాల్ టోర్నమెంటు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు వరుసగా నాలుగు బహుమతులు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000లు నగదును అందజేస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 9052216511 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం ట్రాక్టర్ రివర్స్ పందెం, స్లో మోటార్ సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మురుగు నీటితో రోగుల అవస్థలు



సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ వద్ద పైపులైన్ లీకేజీ

కర్నూలు(హస్పిటల్), మార్చి 11: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వద్ద పైపులైన్ లీకేజీతో రోగులు అవస్థలు పడుతున్నారు. గత పది రోజుల నుంచి సమస్యను అధికారులు పట్టించుకోకపోవడంతో లీకేజీ నీరు రోడ్లపై వస్తున్నాయి. దీంతో రోగులు, వారి బంధువులు మురుగునీటిలోనే నడుస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

టీడీపీలో చేరిన ముడుమలగుర్తి ఉప సర్పంచ్



టీడీపీలో చేరుతున్న ముడుమలగుర్తి ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

కర్నూలు(రూరల్), మార్చి 11: కోడుమూరు మండలం ముడుమలగుర్తి గ్రామ ఉపసర్పంచ్ కురువ గోకారి సోమవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఆయనతో పాటు వార్డు సభ్యులు గొల్లమద్దిలేటి, బోయనాయుడు, మాధన్న, జి.సరోజ, రాధ మరియు గ్రామ సచివాలయ వైసీపీ కన్వీనర్ బోయమధు గ్రామ సర్పంచు సువర్ణ భర్త బోయశంకర్, మామ బోయ మల్లేష్, 300 కుటుంబాలు కలిసి కర్నూలులో టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా విష్ణు మాట్లాడుతూ ముడుమలగుర్తి ప్రజలకు దాహార్తి తీర్చేందుకు జీడీపీ నుంచి నీటిని విడుదల చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన వివరించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో నేశ ఈశ్వరప్ప, సూరి, సంజన్న, హరిక్రిష్ణ, అయ్యస్వామి, దేవేంద్ర, సుధాకర్, మస్తాన్, దేవన్న, కురువపరమేష్, అయ్యప్ప, బాలు, సురేష్, రంగడు, మహేష్, నాగరాజు ఉన్నారు.

- కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామం మాజీ సర్పంచు రంగస్వామిగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాదన్న, శివ, బాబురావు, శేఖర్, గ్రామ మహిళలు విష్ణువర్ధన్‌రెడ్డి, దస్తగిరిని కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు.
- కోడుమూరుకు చెందిన గోపాల్ నాయుడు, హనుమంతప్ప, చాంద్‌బాషా, గిడ్డయ్య విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి దస్తగిరికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటిం చా రు.
- కోడుమూరుకు చెందిన చేనేత సామాజిక వర్గం నుంచి ధర్మరాజు, అనిల్, భాస్కర్, నవీన్, మంజునాథ్ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి మద్దతు తెలిపారు.
- సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామ సర్పంచు కుమారుడు అమర్ ఆధ్వర్యంలో సోమన్న, తిక్కన్న, రవి, మార్కు,ఎల్లప్ప విష్ణు, దస్తగిరిని కలిసి మద్దతు ప్రకటించారు. అలాగే సి.బెళగల్ మండలం బ్యాతోలు గ్రామానికి చెందిన శేఖర్, మద్దిలేటి, లక్ష్మన్న మద్దతు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 11: నగరంలోని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ జి.సృజనకు రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు సుంకన్న, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్, జిల్లా అధ్యక్షుడు అశోక్‌లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో దోమలు విపరీతంగా పెరగడం వలన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో వసంత్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లను ఎస్‌బీఐ బహిర్గతం చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 11: ఎన్నికల బాండ్లను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు తక్షణమే బహిర్గతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కే.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటి అధ్వర్యంలో చిన్నాపార్కు వద్ద ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసిన నరేంద్ర మోదీ విధానాలను సుప్రీం కోర్టు తప్పు పట్టిందన్నారు. ఎన్నికల బాండ్లను జూన్ 6 లోపు ఎస్‌బీఐ విడుదల చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఆయన వివరించారు. మోడీ ప్రభుత్వానికి లొంగిపోయిన ఎస్‌బీఐ బాండ్ల విడుదల కోసం 116 రోజులు గడువు కావాలని అడగడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్. రాధాక్రిష్ణ, సభ్యులు ఎండీ ఆనంద్‌బాబు, మారెళ్ల విజయ్, వై.నగేష్, సి.గురుశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి గోదా గోకులంలో బ్రహ్మోత్సవాలు

రేపు చిన్న జీయర్ స్వామి రాక

కర్నూలు(కల్చరల్), మార్చి 11: నగర శివారులోని మామిదాలపాడులోని గోదా రంగనాథస్వామి వారి దేవస్థానం (గోదాగోకులం)లో మంగళవారం నుంచి దేవస్థానం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తున్నారు. ఈ ఉత్సవాల నేపథ్యంలో దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచీ విచ్చేసే వందలాది భక్తులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈనెల 18 వరకు అష్టాక్షరీ పీఠం పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ, త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ సీయర్ స్వామిజీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు బుధవారం త్రిదండి చిన్నజీయర్ స్వామి విచ్చేసి రెండు రోజుల పాటు భక్తులకు ప్రవచన బోధన చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

అలాగే మంగళవారం స్వస్తివాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజాదివాసంతో బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయని తెలిపారు. బుధవారం ఉదయం శేష వాహన సేవ, సాయంత్రం కల్పవృక్ష వాహన సేవ, 14న ఉదయం సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ, 15న ఉదయం హనుమద్వాహన సేవ, సాయంత్రం గరుడ వాహన సేవ, 16న ఉదయం గజ వాహన సేవ, సాయంత్రం హంస వాహన సేవ, 17న ఉదయం సింహ వాహన సేవ, సాయంత్రం అశ్వ వాహన సేవలు ఉంటాయని తెలిపారు. అలాగే 15న ఉదయం 10 గంటలకు స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవాల్లో నిత్యం సాయంత్రం శ్రీమద్రామాయణ, భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు, మార్చి 11: మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డిలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 19 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా ముద్దవరం మండలం రాముడు, గోపాల్‌గౌడు ఎద్దులు 5,302 అడుగుల దూరం లాగి రూ.50వేల నగదును దాత కర్నూలు మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి అందజేశారు. రెండో విజేతగా దానరిపల్లి గ్రామానికి చెందిన రైతు చిన్న వీరన్న యాదవ్ ఎద్దులు, మూడో విజేతగా అలంకిత గ్రామం మునిరంగడు యాదవ్, రామచంద్రుడు ఎద్దులు, నాలుగో విజేతగా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుధాకర్ ఎద్దులు, 5వ విజేతగా డేమలికంట్ల గ్రామానికి చెందిన కాశీంవలి, జానకిరాముడు ఎద్దులు నిలిచాయి. అలాగే 6వ విజేతగా మేడికంట గ్రామానికి చెందిన సద్దాం హుశేనీ ఎద్దులు, 7వ విజేతగా ఏ.కోడూరు స్ఫూర్తికరెడ్డి ఎద్దులు, 8వ విజేతగా కలుగోట్ల గ్రామం రమేష్ నాయుడు ఎద్దులు నిలిచాయి. విజేతలకు దాతలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హుశేనాపురం సొసైటీ అధ్యక్షుడు నాగతిరుపాలు, కాల్వబుగ్గ మాజీ ఛైర్మన్ గోప రమణారెడ్డి, నాయకులు వెంగన్న, వెంకటేశ్వర్లు, మోహన్ రెడ్డి, గడేకారి భాస్కర్ రెడ్డి, కొట్టాల శ్రీనివాసరెడ్డి, చాంద్‌బాషా, లోటర్ బాషా పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 11: స్పందన అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం వహించొద్దని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యాలయంలోని పాతకౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర్ మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలన్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, వ్యర్థాలు, నీటి సమస్యలపై వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఎస్ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జి డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ధర్నా చేస్తున్న నాయకులు, బైరెడ్డి కాలనీవాసులు

ఓర్వకల్లు, మార్చి 11: ఓర్వకల్లులోని బైరెడ్డి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా బైరెడ్డి కాలనీవాసులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు నాగన్న, సహాయ కార్యదర్శి మధుసూదన్, మాట్లాడుతూ బైరెడ్డి కాలనీ వాసులు తాగునీటి కోసం పనులు వదులు కొని పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. స్పందించిన ఎంపీడీవో మల్లిశ్వరి, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, గ్రామ నాయకులు శంకర్ రెడ్డి మాట్లాడుతూ తక్షణమే తాగునీటి సమస్య పరిష్కారానికి త్వరలో బోరు వేయిస్తామన్నారు. అంతవరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మహ్మద్, శ్రీరాములు, సయ్యద్ బాషా, ఇబ్రహీం, క్రిష్ణ, నరసమ్మ, సరోజ, మాసూంబాషా, రామాంజనేయులు, మరియమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



యోగా గురువు దత్తయ్యతో సత్కారం పొందిన మహిళలు

కర్నూలు(కల్చరల్), మార్చి 11: స్థానిక వెంకటరమణ కాలనీలోని పతంజలి సాయినాథ్ యోగ సేవా ట్రస్టు మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వీఆర్ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య హాజరై మాట్లాడారు. యోగ శిక్షణ కేంద్రంలో, సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు ఉండటం అభినందనీయమని అన్నారు. అనంతరం దివ్యాంగులైన మహిళలకు వీల్ ఛైర్లు అందజేశారు. పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే విద్య, వైద్యం, న్యాయ, సామాజిక రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలను సత్కరించారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

పద్మనాభ శర్మకు జ్యోతిష్య బ్రహ్మ అవార్డు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 11: పట్టణానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితుడు పద్మనాభ శర్మకు హైదరాబాద్‌కు చెందిన ఎస్‌ఎస్ లైవ్ జ్యోతిష్య సంస్థ "జ్యోతిష్య బ్రహ్మ" అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కువలన ఆవశర్మ మాట్లాడుతూ జ్యోతిష్య శాస్త్రంలో అనుభవంతో పాటు తన సేవలను గుర్తించి తనకు అవార్డును ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సీ నరసింహ స్వామి చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషం కలిగించిందని పేర్కొన్నారు.

ప్రార్థనా మందిరాల వద్ద శుభ్రత పాటించాలి

ఆదోని టౌన్, మార్చి 11: రంజాన్ పండుగకు సంబంధించి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా పట్టణంలోని అన్ని మసీదుల పరిసరాలలో పారిశుద్ధ పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్ అహ్మద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్ అన్నారు. సోమవారం వీరు మాట్లాడుతూ, మైనార్టీలకు ముఖ్యమైన రంజాన్ పండుగ సందర్భంగా నెల రోజుల పాటు ఉపవాసాలు ఉంటూ, నిత్యం ప్రార్థనలు చేస్తారని, ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని వారు కోరారు.

ఉద్యోగ సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 11: రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు భద్రత లేని సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తమని, 12 పీఆర్సీ అమలు చేసి 40 శాతం ఫిట్మెంట్ ఇస్తామని మేనిఫెస్టోలో చేర్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా కార్యదర్శి గోపాల్, మండల అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీహైడ్రేషన్ యూనిట్‌ను తొలగించండి

గోనెగండ్ల, మార్చి 11: మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలోని ప్రభుత్వ, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా గ్రామ నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఫ్రూట్స్ అండ్ విజిటబుల్స్ సోలార్ డీహైడ్రేషన్ యూనిట్‌ను తొలగించాలని పెద్దనేలటూరు గ్రామస్థులు సుభాన్, షేక్షావలి, లక్ష్మన్న, చిన్ననరసింహులు, మగ్బూల్, పాపన్న, నీలకంఠ, రాజు, శివ కోరారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో సోనిబాయికి వినతి పత్రం అందజేశారు. వారం రోజుల క్రితం స్థానిక పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీ మఠం అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, మార్చి 11: రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సీఎచ్ నరేంద్రబాబు అనే భక్తుడు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని అన్నదాన కార్యక్రమానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ప్రభుత్వ భూముల కబ్జాను అడ్డుకోండి

మంత్రాలయం, మార్చి 11: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో సర్వే నెంబర్.151లో 16.38 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారని గ్రామానికి చెందిన రామాంజనేయులు, మాజీ సర్పంచులు స్వామినాథన్, లక్ష్మప్ప, రామాంజనేయులు, లక్ష్మిరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో డీటీ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. కొంత మంది అధికారాన్ని అడ్డు పెట్టుకొని వైసీపీ నాయకులు 5.46 ఎకరాల భూమిని తమ పేర్ల మీదుగా నమోదు చేయించుకొని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇలాంటి ప్రభుత్వ భూముల్లో చెక్‌డ్యాంల నిర్మాణం చేపడితే.. వాటిని పూడ్చి కబ్జా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పేర్కొన్నారు. గ్రామంలోని మూగజీవాలు, పశుగ్రాసం మేయడానికి ప్రభుత్వానికి అవసరమైన భూములు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో నాగరాజు, వీరన్న, నాగార్జున, వీరేష్, నర్సిరెడ్డి, అంజనేయ, రాఘవేంద్ర, నరసింహులు పాల్గొన్నారు.

గొర్రెలను ఎత్తుకెళ్లిన దొంగలు

చిప్పగిరి, మార్చి 11: మండల పరిధిలోని కొన్నుగుర్తి గ్రామానికి చెందిన మీనిగి వెంకటేష్‌కు చెందిన 30 గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి, ఆటోని కొంత దూరంలో ఉంచి గొర్రెలను తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఈ విషయాన్ని చిప్పగిరి ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు నాలుగు లక్షల రూపాయల విలువ చేసే గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లారని వెంకటేశు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలకు మరింత సులభతరం అయ్యిందని పలువురు వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటకవాసి మృతి

ఆలూరు, మార్చి 11: ఆలూరు మండలంలోని మనేకుర్తి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఆలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలో హొస్పేట్‌కు చెందిన మొహమ్మద్ సిద్ధిక్ ఆదోని వైపు వెళ్తుండగా గొనేగండ్ల రాళ్లదొడ్డికి చెందిన మల్లికార్జున, షఫీ ఆలూరు వైపు వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొవడంతో ముగ్గురు చెల్లాచెదురై పోయారు. హొస్పేట్‌కు చెందిన సిద్ధిక్ (26)కు తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి కూడా తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

● వగరూరులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

మంత్రాలయం : టీడీపీ కార్యకర్తలు, నాయకుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వగరూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి వాల్మీకి రామిరెడ్డి మొదటి వర్ధంతిని నిర్వహించి ఆయన సమాధి వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి అండగా ఉంటారని తెలిపారు. టీడీపీ నాయకులు ధైర్యంగా ఉండాలని, వైసీపీ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడవద్దని సూచించారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఎల్లారెడ్డి, మైనార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, లింగప్ప, దస్తగిరి, ఏసన్న, ప్రతాప్ పాల్గొన్నారు.

బ్రిడ్జికి శంకుస్థాపన

వెల్దుర్తి, మార్చి,11 : మండలంలో చెరుకులపాడు గ్రామంలో హంద్రీ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం భూమి పూజ చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.23 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రవిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్, డీఈ రుక్మిణీ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

గోనెగండ్ల, మార్చి 11: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని మండల తెలుగు యువత అధ్యక్షుడు రంగస్వామినాయుడు, ప్రధాన కార్యదర్శి పూజారి లక్ష్మీకాంత స్వామి అన్నారు. సోమవారం మండల టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకుగాను టీడీపీ హయాంలో ఎంపీఎస్ స్కీం కింద రూ. 13.50 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మునిస్వామి, చిన్నస్వామి తెలుగుయువత నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

● హోసూరు, దూదెకొండ గ్రామాల్లో కేఈ ప్రచారం
● జిల్లా వ్యాప్తంగా సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన
● పెండేకల్, మద్దికెర గ్రామాల్లో టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

పత్తికొండ , మార్చి 11 : రాష్ట్రంలో మహిళా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. బాబుష్యూరిటీ భవిష్యత్‌గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో పర్యటించి ఆ పార్టీ అధికారం చేపట్టాక అమలు చేయబోయే మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఇందులో భాగంగా కేఈ శ్యాంబాబు పత్తికొండ మండలం హోసూరు, దూదెకొండ గ్రామాల్లో పర్యటించి మినీమేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, 18 ఏళ్లు నిండిన ప్రతిఆడబిడ్డకు నెలకు రూ1,500, దీపం పథకం కింద ఉచితంగా మూడు సిలండర్లు, తల్లికివందనం పేరిట చదువుకునే ప్రతివిద్యార్థికి రూ 15,000 నగదు, 20లక్షలమంది యువతకు ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ యువతకు రూ 3,000 నిరుద్యోగభృతి వంటి ఎన్నో పథకాలు అమలవుతాయన్నారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రామానాయుడు, వాకిటిశ్రీనివాసులు, గుడిసెనరసింహులు, జగ్గిలిఅంజి, రాఘవేంద్రలతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకాలమ్మకు పూజలు: పత్తికొండ పట్టణ గ్రామదేవతలు అంకాలమ్మ, బంగారమ్మదేవాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. దేవాలయానికి సంబంధించి నూతనంగా నిర్మించిన ఆర్చీ ప్రారంభోత్సవానికి హాజరై ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి పూజలనంతరం శాలువాతో సత్కరించారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి

తుగ్గలి : వైసీపీ ప్రభుత్వ అక్రమ పాలనకు అంతమయ్యేందుకు రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ మాజీ మండల కన్వీనర్ వీరభద్రప్ప అన్నారు. పెండేకల్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్ రాష్ట్రాన్ని మరో 20 ఏళ్లు వెనక్కు నెట్టారన్నారు.



హోసూరులో బాబుష్యూరిటీ భవిష్యత్ కార్యక్రమంలో కేఈ

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. టీడీపీ నాయకులు రాజు, మల్లి, నాయుడు, తదితరులు ఉన్నారు.

సీఎం జగన్ రాష్ట్రానికి పట్టిన శని

మద్దికెర : సీఎం జగన్ రెడ్డి రాష్ట్రానికి పట్టిన శని అని పత్తికొండ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, ఎస్సీ సెల్ నాయకులు పారా విశోబ అన్నారు. మద్దికెర గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి రోజూ ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సూపర్‌సిక్స్ పథకాలతో మరింత ముందుకు వెళ్తుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొల్లాపురం చంద్ర, సాయినగర్ బాషా, టైలర్ మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

క్వింటా పత్తి రూ.8 వేలు

● వారంలో రూ.300 పైగా పెరుగుదల

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 11: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం క్వింటాలు పత్తి ధర రూ.8 వేలుకి చేరుకుంది. ఏడాదిగా పత్తి ధర రూ.7,800 మించలేదు. రైతులు పత్తి దిగుబడి అంతా విక్రయించుకున్నాక ధరలు పెరుగుతుండడంతో నిరాశ చెందుతున్నారు. పరిశ్రమల్లో ఉత్పత్తికి అవసరమైన పత్తి లేకపోవడం, వ్యాపారుల మధ్య పోటీ పెరగడంతో పత్తి ధరలు పెరగడానికి కారణమయ్యాయి. ఇప్పటికే రైతులు తమ దగ్గర ఉన్న పత్తినంతా విక్రయించుకున్నారు. కొంతమంది రైతులు ధర పెరుగుతుందని ఆశించి ఖరీఫ్ పెట్టుబడి ఖర్చుల కోసం నిల్వ ఉంచుకున్నారు. అంతర్జాతీయ



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి

మార్కెట్ ప్రభావం వల్ల పత్తి ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. 795 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5,009, గరిష్ఠ ధర రూ.8,000, మధ్యస్థ ధర రూ.7,501 పలికింది.

హామీలను నెరవేర్చని జగన్ : బీవీ



చాకలి వీధిలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న బీవీ

ఎమ్మిగనూరు, మార్చి 11: ఎన్నికలకుముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ ఐదేళ్ల కాలంలో జగన్ నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 10,11 వార్డులలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి కి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్‌పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్లు, ముల్లా సలామ్, జహంగీర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొండయ్యచౌదరి, కౌన్సిలర్‌లు రామదాస్ గౌడ్, దయాసాగర్, నాయకులు మిఠాయినరసింహులు, రంగస్వామిగౌడ్, రామకృష్ణనాయుడు, సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించే పార్టీలకే మద్దతు

పాస్టర్స్ అసోసియేషన్

ఆలూరు, మార్చి 11: క్రైస్తవుల సమస్యలను పరిష్కరించే వారికే తమ మద్దతు ఉంటుందని ఆలూరు నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై ప్రకాశం అన్నారు. సోమవారం పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆలూరు పాస్టర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దేవదానం అధ్యక్షతన తాలూకా పాస్టర్ల సమావేశం జరిగింది. వివిధ సంఘాల పాస్టర్లు హాజరయ్యారు. ప్రకాశం మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు క్రైస్తవులను ఎన్నికల సమయంలో ఓటు బ్యాంక్‌గా వాడుకొని అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. క్రైస్తవ ఆస్తులను, ఆలయాలను పరిరక్షించి, ప్రతి మండలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న పాస్టర్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, క్రైస్తవ సమాధుల స్థలాలని అభివృద్ధి చేసి ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. సువార్త పరిచర్యలకు స్వేచ్ఛనివ్వాలని, క్రిస్టియన్లను దళిత క్రైస్తవులుగా గుర్తించి, పాస్టర్లపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.



మాట్లాడుతున్న పాస్టర్స్ అసోసియేషన్ ఆలూరు అధ్యక్షుడు ప్రకాశం

న్నారు. చర్చిల నిర్మాణాలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించి ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలును ఏర్పాటు చేయాలన్నారు. నియజవకర్గ పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్యామ్ బాబు, ఉపాధ్యక్షులు బెన్‌హర్ బాబు, కోశాధికారి టీ ఏసన్న, సహాయ కార్యదర్శి విజయ్ కుమార్, లీగల్ అడ్వైసర్ డీ విజయరాజు పాల్గొన్నారు.

టీడీపీకి పెరుగుతున్న ఆదరణ : వీరభద్రగౌడ్



గజమాలతో వీరభద్రగౌడ్‌ను సన్మానిస్తున్న టీడీపీ కార్యకర్తలు

ఆలూరు, మార్చి 11: టీడీపీకి ప్రజల్లో ఆదరణ మరింతగా పెరిగిందని, ఎన్నికలు ఎప్పుడు జరిగిన ప్రజలు చంద్రబాబుకు పట్టం కడతారని ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. సోమవారం ఆలూరులోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, టీడీపీ అమలు చేయబోతున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు.

టీడీపీ గెలుపు కోసం కృషి చేయండి

హాలహర్వి: అరాచక ప్రభుత్వానికి స్వస్తి చెప్పి టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ మాజీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. యువనేత కిశోర్ ఆధ్వర్యంలో వైసీపీకీ చెందిన 20 మంది టీడీపీ చేరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, వీరభద్ర, సూరి, నాగప్ప, పాల్గొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయండి

ఆదోని, మార్చి 11: నందవరం మండలం పులిచింత గ్రామంలో 20 సంవత్సరాలుగా 2.50 సెంట్ల ఇంటి స్థలంలో నివసిస్తున్నానని, ఇంటి స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని గ్రామానికి చెందిన పోతురాజు నాగన్న సబ్‌కలెక్టర్‌ను కోరారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని...

● కొద్ది రోజుల క్రితం నివాసముంటున్న తమ ఇల్లు కూలిపోయిందని, అందులో ఇంటికి సంబంధించిన పత్రాలు పోగొట్టుకుపోయాయని, ఇంటికి సంబంధించిన ప్రత్రాలు నకలు పత్రాలు ఇప్పించాలని ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామానికి చెందిన లొడ్డ ఈరన్న అధికారులకు అర్జీ సమర్పించారు.

● చిన్నహరివాణం గ్రామానికి చెందిన అంజనమ్మ తనకు సర్వే నెంబర్ 101/డీలో 1.17 ఎకరాల భూమి ఉందని, ఈ భూమి ఆన్‌లైన్‌లో 2.17 ఎకరాలుగా చూపుతోందని, విచారణ చేసి తన భూమిని మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

● మద్దికెర మండలం పెరవల్లి గ్రామానికి చెందిన బీ వెంకట సాయి



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

రంగ గత నెలలో ఐచర్ వాహనం కొనుగోలు చేశానని, రిజిస్ట్రేషన్ సాంకేతిక సమస్య వలన ఆలస్యమవుతోందని, త్వరగా వాహన రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏవో శేషయ్య, సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాస రాజు, హౌసింగ్ డీఈ రవికుమార్, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమమద్ రఫీ, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, ఆర్టీవో నాగేంద్ర, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, డీటీలు వినీత్, కౌసార్ భాను, వలి భాష పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం

మంత్రాలయం, మార్చి 11: మండలంలోని సూగూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-1 ఆర్డీటీ సంస్థ ఉచితంగా నిర్మిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. సోమవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. ఆర్డీటీ ఇలాంటి సేవలు చేయడం వల్ల ప్రతి పేద కుటుంబానికి ఎంతో తోడ్పాటు అందుతుందన్నారు. 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ భవన నిర్మాణానికి ముందుకు వచ్చిన ఆర్డీటీ సంస్థ యజమాన్యానికి అభినందనలు తెలిపారు.

ఎడెక్స్ కంపెనీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 11: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో, యూనివర్సిటీలలో ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు ఎడెక్స్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేసుకోవాలని పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి తిరుమలేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక భీమాస్ సర్కిల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, యూనివర్సిటీల్లో కనీస వసతులు, అధ్యాపకులు లేక కొట్టుమిట్టాడుతుంటే ఆన్‌లైన్ కోర్సులకు ప్రభుత్వం ఎడెక్స్ కంపెనీకి రూ.50 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆన్‌లైన్ తరగుతులు వల్ల విద్యార్థుల నైపుణ్యాలు సామర్థ్యాలు పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రభుత్వం వెంటనే కళాశాలలో అధ్యాపకులను నియమించి, ప్రత్యక్ష తరగతులను బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి శివ, ఇస్మాయిల్, మహిళా సెల్ కన్వీనర్ నిఖిత, శ్రావణి, పీరమ్మ, మనోజ్, గిడ్డయ్య, గోవిందు పాల్గొన్నారు.

న్యాయవాది సురేష్‌కు సన్మానం

పత్తికొండ/పత్తికొండటౌన్, మార్చి 11 : టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్రకార్యదర్శి సురేష్‌ను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అభినందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు సాంబశివా రెడ్డి, ప్రమోద్ కుమార్‌రెడ్డి, రామానాయుడు, బత్తినలోక్‌నాథ్, కడవల సుధాకర్ అభినందించి పూలమాలతో సన్మానించారు. అలాగే టీడీపీ, ఎన్టీఆర్ ఫ్యాన్స్ నాయకులు సింగంశ్రీను, మీరాహుసేన్, రంగన్న పూల మాలతోస సన్మానించారు.

న్యాయవాది సురేష్‌కు తోటి న్యాయవాదులు సత్కారం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, రంగస్వామి ఆధ్వర్యంలో సురేష్ కుమార్‌ను శాలువ, పూలమాలతో సత్కరించారు. సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, సత్యనారాయణ, నాగభూషణం రెడ్డి, సురేంద్ర కుమార్, దామోదరాచారి పాల్గొన్నారు.

బుడగ జంగాల కమ్యూనిటీ భవనం ప్రారంభం

మంత్రాలయం, మార్చి 11: బేడ, బుడగ జంగాల శుభకార్యాలు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాలును మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం రాఘవేంద్రపురంలో బంగారు బాబు ఇంటి సమీపంలో నిర్మించిన కమ్యూనిటీ హాలుకు రిబ్బన్ కట్ చేసి పూజలు చేశారు. ఈ భవనం బేడ, బుడగ జంగాల సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గురెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, కురువ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

మంత్రాలయం, మార్చి 11: మండలంలోని రాబోవు ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సోమవారం మండలంలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి, మాలపల్లి గ్రామాల్లో మంత్రాలయం సీఐ ఎరిషావలి, మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రధాన రోడ్లు, పురవీధుల గుండా ఆయుధాలతో కవాత్తు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని, అల్లర్లు, రెచ్చగొట్టడం వంటి చర్యలకు పాల్పడితే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ బందెనవాజు, వీరేష్, వీరాంజనేయులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

మద్దికెరలో కవాతు

మద్దికెర : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రూరల్ సీఐ ప్రవీణ్ కుమర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సంపూర్ణ సహకారాలు అందించాలన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారం అందించాలని కోరారు. ఎస్ఐ రమేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

ఏపీయూడబ్ల్యూజే డైరీ ఆవిష్కరణ

మంత్రాలయం, మార్చి 11: మాధవరం గ్రామంలో ఏపీయూడబ్ల్యూజే డైరీని టీడీపీ జిల్లా సీనియర్ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. సోమవారం ఏపీయూడబ్ల్యూజే తాలుకా అధ్యక్ష కార్యదర్శులు జయరాజు, హుశేనీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఇటీవల జర్నలిస్టులపై జరిగిన దాడులు సిగ్గు చేటని, జగన్ సిద్ధం సభకు మీడియాకు ఆంక్షలు పెట్టి ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఏ ఆపద వచ్చినా అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి సాబువలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సూర్యనారాయణాచారి, గోవిందు, భీమరాయ, రఫిక్, రామస్వామి, వెంకటేష్, మహబూబ్, బాబురావు, వీరేష్, నరసింహులు, రాఘవేంద్ర, షఫి, రామకృష్ణ పాల్గొన్నారు.

భీర లింగేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం

మంత్రాలయం, మార్చి 11: మండలంలోని చెట్నహల్లి గ్రామంలో వెలసిన భీర లింగేశ్వరస్వామి దేవర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం చెట్నహల్లిలో వెలసిన అల్లింగప్ప స్వామి పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన యాదగిరప్ప స్వామి, ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన వన్నికేరప్పస్వాముల పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవతా త్రిమూర్తులను పల్లకిలో ఉంచి తుంగభద్ర నది వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కురువుల ఆరాధ్యదైవమైన స్వామివార్లు ముగ్గురు ఒకేచోటకు చేరడంతో అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించండి

ఎమ్మిగనూరు : కేంద్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వం ఎన్నికల నిర్వహన పేరుతో సేకరించిన ఎన్నికల బాండ్ల వివరాలను ప్రజలకు తెలియజేయాలని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఎదుట ధర్నా నిర్వహించి మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మినరసయ్య, కృష్ణ, రాజు, నాగరాజు, చంద్ర, శంకర్, ముక్తార్, మాదన్న, రాముడు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఆదోని రూరల్, మార్చి 11 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా, ఆదోని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ తహసీల్దార్ బదిలీ అయ్యారు. ఆదోని రెగ్యూలర్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న రజినీకాంత్‌రెడ్డిని ఆలూరుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో కోసిగిలో విధులు నిర్వహిస్తున్న రుద్రగౌడ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ఉప తహసీల్దార్‌గా కౌతాళంలో విధులు నిర్వహిస్తున్న రామేశ్వరరెడ్డి కూడ ఆదోని ఎన్నికల ఉప తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

రైతు ఉద్యమానికి మద్దతు పలకాలి

ఎమ్మిగనూరు, మార్చి 11: దేశ రాజదాని ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పంటలకు గిట్టుబాటు ధరలకు చట్ట బద్దత కల్పించాలని కోరుతూ గత నెల 23 నుంచి పోరాటం జరుగుతుందని దీనికి మద్దత్తుగా రైతులు రైతుసంఘాల నాయకులు పోరాటం చేయాలని రైతు సంఘం జిల్లానాయకులు పంపన్న గౌడ్, రాజు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో వాపక్ష సంఘాల సమావేశం రాముడి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ ఉద్యమానికి మద్దత్తు గా ఈనెల 14 న పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాలని కోరారు.